బీజేపీ కుటిల నీతికి ప్రజలే బుద్ధి చెప్పాలి

- ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సేవకుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బీజేపీ కుటిల నీతికి ప్రజలే బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర ఉపాధ్య క్షులు డాక్టర్ టి.సేవ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నియంతలా..పాలిస్తూ రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజాస్వామ్యానికే తూట్లు పొడుస్తున్నారని ఆయన విమర్శిం చారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజకీయకుట్రలో భాగంగా అరవింద్ కేజ్రీవాల్'ను అరెస్టు చేశారని, అరవింద్ కేజ్రీ వాల్' ను, ఆమ్ ఆద్మీ పార్టీని చూసి నరేంద్ర మోడీ భయపడుతున్నట్లు చెప్పారు.రానున్న సార్వత్రిక ఎన్నికలలో దేశ వ్యాప్తంగా బీజేపీ కుటిల బుద్ధికి ప్రజలు చెంపపెట్టు తీర్పును ఇవ్వనున్నారని, అక్రమంగా అరెస్టు చేసిన అరవింద్ కేజ్రీవాల్'ను విడుదల చేయాలని లేకపోతే దేశ వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

బీసీలను చిన్న చూపు చూసినందుకే రాజకీయ పార్టీల ఓటమి

విశాలాంధ్ర-తెనాలి : భారతదేశం సనాతన ధర్మంపై పునాది కలిగి వుందనే విషయాన్ని ఆనందశర్మ లాంటి నాయకులు తెలుసుకోవలసిన అవసరం వుందని బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. తెనాలిలో శుక్రవారం బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సీడబ్ల్యూసీ సభ్యుడు ఆనంద శర్మ జనగణను చేయ దాన్ని తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసే చరిత్రహీనుడుగా మిగిలా దారన్నారు. ఎప్పటికైనా నాయకులు రాజకీయ పార్టీలు తెలు సుకుని బీసీలను గుర్తించాలని, బీసీలు తలచుకుంటే అభ్యర్థులు జయాపజయాలు నిర్ణయించబడతాయని చెప్పారు. బీసీ నాయకులు పాల్గొన్నారు.

పెమ్మసానికి నా సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-గుంటూరు : అతి తక్కువ సమయంలోనే ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. నా సంపూర్ణ మద్దతు మీకే. మీతో పాటు నేనూ ప్రచారానికి వస్తాను. సంపూర్ణ మద్దతు ఇస్తాను అని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు అన్నారు. గుంటూరులో నివసిస్తున్న రాయపాటిని డాక్టర్ పెమ్మసాని శుక్రవారం ఆయన ఇంటికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులో పరిష్కారం కాని, పలు సమస్యలపై రాయపాటితో పెమ్మసాని చర్చించారు. జరగబోయే ప్రచార కార్యక్రమాలకు తానూ కలిసి వస్తానని రాయపాటి హామీ ఇచ్చారు.

ట్రాక్టర పైనుంచి పడి బాలుడు మృతి

విశాలాంధ్ర-తుళ్లూరు: ట్రాక్టర్ పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం తుళ్లూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పెదపరిమి గ్రామానికి చెందిన యర్రమాల చందు (14) అనంతవరం నుంచి పెదపరిమి వెళ్ళటానికి కంకర లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ఎక్కాడు. నెక్కల్లు గ్రామ సమీపంలో ట్రాక్టర్ పైనుంచి జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయమవటంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టామన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏటీ అగ్రహారంలోని జిల్లా కార్యాలయంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి వెంకట శివ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు, చిరుతనగళ్ళ గోపి, ఆకారపు అంకమ్మరావు, ఎనగందుల పూర్ణచంద్రరావు, పొరల అంకమ్మరావు, ఇందుర్తి రాంబాబు, వై.సైదేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని సందర్శన



విశాలాంధ్ర-ప్రత్తిపాడు : గుంటూరు రూరల్ మండల పరిధిలోని నాయుడుపేట గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యకర్తలతో కలిసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.రామాంజనేయులు పరిశీలించారు. 37 అడుగుల లోతు వరకు అక్రమంగా గ్రావెల్ మైనింగ్‌జరిగిందని, దీనిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులకు అక్రమ మైనింగ్ ప్రాంతం వరంగా మారిందని అడ్డుఅదుపు లేకుండా అక్రమ ఆదాయం సంపాదిస్తున్నారని విమర్శించారు.తవ్వకాలు ఆపకపోతే అధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించిన ధూళిపాళ్ల

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇటీవల కాలంలో అనారోగ్యం, యాక్సిడెంట్ కారణంగా మృతి చెందారు. కొమ్మాలపాటి రాజేష్, కొచర్ల అనీల్, షేక్ నాగుల్ మీరా, షేక్ హుస్సేన్ వారి కుటుంబాన్ని పొన్నూరు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఉప్పలపాడు గ్రామంలో సీనియర్ తెలుగుదేశం కార్యకర్త పెద్ది నరసింహారావు అత్త రాజ్యలక్ష్మి పెద్దకర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల, గ్రామ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

25, 26 న తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పైప్ లైన్ మరమత్తు పనుల వలన సోమవారం సాయంత్రం నుండి మంగళవారం ఉదయం వరకు నగరంలోని నాజ్ సెంటర్ రిజర్వాయర్ పరిధిలోని 5,7 డివిజన్లలోని నాజ్ సెంటర్, గుంటూరువారి తోట, పొత్తూరువారి తోట, గణేష్ రావు పేట, కొత్తపేట, రాజాగారితోట, రామిరెడ్డితోట 1 నుండి 8 లైన్లు, గంటలమ్మ చెట్టు, చౌత్రా సెంటర్, పూల మార్కెట్, ఎల్బీనగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందని, మంగళవారం (26వ తేదీ) సాయంత్రం నుండి తాగునీటి సరఫరా యధావిధిగా జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు.

రూ.98,600 స్వాధీనం

విశాలాంధ్ర-తాడికొండ : ఎలాంటి రసీదులు లేకుండా తీసుకెళుతున్న రూ.98,600లను తాడికొండ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో చెక్‌పోస్ట్ వద్ద రోజు మాదిరిగానే తనిఖీలు నిర్వహిస్తున్నారు. గుంటూరు నగరాలకు చెందిన సిహెచ్ ఆది లక్ష్మి వద్ద నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పిల్లలకు ఫీజు కట్టేందుకు నగదు తీసుకెళుతున్నట్లు ఆమె సమాధానం ఇచ్చారు.

నేడు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సభలను జయప్రదం చేయండి

- రైతు, కార్మిక, ప్రజా సంఘాల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేట లోని పియల్ రావు భవన్లో రైతు కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.విఠల్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, జాతీయ రైతు కూలీ సంఘం నాయకులు వేల్పూరి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.కృష్ణ కాంత్, సిఐటియు నాయకులు బి.లక్ష్మణరావు, షేక్ ఖాసిం పాల్గొన్నారు. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు, దేశ ప్రజల మాన, ప్రాణాలను కాపాడటా నికి, దేశంలో ఉన్న వనరులను కొల్లగొట్టే దానికి వ్యతిరేకంగా యువకులుగా సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవులు ప్రాణత్యాగం చేశారన్నారు. ఈనాడు స్వదేశీ పాలకులైన బిజెపి పరిపాలనలో స్వదేశీ కార్పొరేటర్లు విదేశీ కార్పొరేట్లతో కలిసి దేశంలో ఉన్న వనరులను కొల్లగొట్టే విధంగా పరిపాలన కొనసాగించు తున్నారు. దీనిని దేశ ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు భగత్ సింగ్‌ను ఆదర్శవంతంగా ఢిల్లీ రైతు పోరాటం ఆనాడు విజయం సాధించింది అన్నారు. నేడు రెండో ఢిల్లీ రైతు పోరాటం జరుగుతున్న ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ప్రజా సంఘాలు ఈ సంవత్సరం భగత్ సింగ్ వర్ధంతిని అన్ని సంఘాలు కలిపి చేయాలని, దేశంలో ఉన్న బిజెపి పరిపాలన దుయ్య బట్టాలని, బిజెపికి మద్దతు ఇస్తున్న పార్టీలను వ్యతిరేకించాలని కోరుతూ శనివారం గుంటూరు కేంద్రంలో, జిల్లాలోని అన్ని మండల, గ్రామాల్లో భగత్ సింగ్ భగత్ సింగ్ వర్ధంతి సభలు జరిపి ప్రజలకు వివరించాలన్నారు. స్వాతంత్రం వచ్చిన ఈ 70 సంవత్సర కాలంలో ప్రజలకు ఉపయో గపడే అనేక వ్యవస్థలను నిర్మించడం జరిగిందన్నారు. కానీ నేడు బిజెపి ప్రభుత్వం ఈ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేసి కేవలం ఒక శాతం కార్పొరేట్లకు అప్పచెప్పే కుట్ర చేస్తుం దన్నారు. దేశంలో రైతులు, కౌలు రైతులు, కార్మికుల దీర్ఘంగా సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసే పద్ధతిలో పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదని, నేడు జరుగనున్న వర్ధంతి సభలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

సీఆర్ నగర్‌కు రోడ్లు, కాలువలు కల్పించాలి

- సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు రూరల్ చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నగర్‌లో రోడ్లు, కాలువల సౌకర్యం కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. చంద్ర రాజేశ్వరరావు నగర్ సీపీఐ కార్యదర్శుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీఆర్ నగర్‌లో సీపీఐ పోరాట ఫలితంగా విద్యుత్, రోడ్లు, కాలువలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోగలిగామని అలాగే పల్స్ సర్వే నిర్వహించారని, ఓట్లు సాధించుకోగలిగామని స్వచ్ఛ భారత్‌లో భాగంగా జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా సుమారు 3000 మరుగుదొడ్లు నిర్మించుకోగలిగామని అన్నారు. కానీ నూతనంగా ఏర్పడిన నగరపాలక సంస్థ పాలకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని అన్నారు. వెంటనే మెయిన్ రోడ్డు అలాగే సైడ్ రోడ్లు, కాలువలు నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. మెయిన్ రోడ్డుకు సంబంధించి గత ఎంపీ కాలంలోనే శంకుస్థాపన చేయడం జరిగిందని, ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర నాయకులు రావుల అంజిబాబు, దేవానాయక్, నాగుల్ మీరా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డంప్ చేస్తున్న చెత్తను, కోళ్ళ వేస్టేజ్‌ను తొలగించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాజ్‌కమల్ 100 అడుగుల రోడ్‌లో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న చెత్తను వెంటనే తొలగించి గ్రామ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొర్రా మల్లికార్జునరావు, చాగర్లమూడి మధుసూదన్ రావు కోరారు. చిన్నకాకాని గ్రామంలోని రాజ్‌కమల్ 100 అడుగుల రోడ్డు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాన్ని డంపింగ్ యార్డ్‌గా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ వేస్తున్న వేస్టేజ్‌ను త్వరగా తొలగించి గ్రామ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాన్ని సీపీఐ నాయకులు, చిన్న కాకాని గ్రామస్తులు అందించారు. చిన్నకాకాని గ్రామంలో నేషనల్ హైవే పక్కన పడమర వైపు ఉన్న రాజ్‌కమాల్ 100 అడుగుల రోడ్డులో చుట్టుపక్కల ఉన్న గ్రామా లలోని వేస్టేజ్, చెత్త మొత్తం వంద అడుగుల రోడ్డు పక్కన వేయటం వలన నిత్యం వందలాది మంది ఆ రోడ్డులో ప్రయాణించవలసిన పరిస్థితి ఉందన్నారు. అక్కడ వేస్తున్న కోళ్ల వ్యర్థాల వేస్టు, కొబ్బరి బొండాల వేస్ట్, ఇంకా అనేక రకాల వేస్టేజీలు అక్కడ డంప్ చేయడం వలన దుర్వాసనలు వెదజల్లుతూ, గ్రామ వాసులు అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు. గ్రామస్తులు అనారోగ్య బారిన పడకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మీడియా కమీషన్‌ను ఏర్పాటు చేయాలని, వర్కింగ్ జర్నలిస్టులకు వేతన సవరణ కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ప్రతి నిధి బృందం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్‌కు విన్నవించింది. ఈ నెల 23న భగత్ సింగ్ వర్ధంతి, దేశవ్యాప్త జర్నలిస్టుల కోర్కెల దినోత్సవంను పురస్కరిం చుకొని శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో నారా లోకేష్‌ను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృంద సభ్యులు కలిశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లను వినతిపత్రం ద్వారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, కార్యవర్గ సభ్యులు పి.భక్తవత్సలం, ఐజేయు సభ్యులు ఓ.మార్కం దేయులు, ఏపీయూడ బ్ల్యూజే గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జొన్న రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా గుంటూరు జిల్లా అధ్యక్షులు సునీల్, ఏపీయూడ బ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ ప్రతినిధులు జొన్నావెంకటేష్, (సాంబ) పాల్గొన్నారు.

వైసీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంగళగిరి నియోజకవర్గం లక్ష్మీ నరసింహ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ పార్టీకి చెందిన ఎస్టీ సామాజికవర్గ నేత జగన్నాథం సాంబశివరావు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు(పండు) ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు నివాసం వద్ద వైసీపీ జెండా కప్పుకుని పార్టీలో జాయిన్ అయ్యారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అధ్యక్షతన 50 ఎస్టీ కుటుంబలు వైస్సార్సీపీ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలసాని అనిల్, మంగళగిరి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేడా చైతన్య, తాడేపల్లి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తి అశోక్, పార్టీ సీనియర్ నాయకులు పేరం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం ఒక్క శాతం ప్రజల చేతుల్లో ఉండటం సిగ్గుచేటు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం కేవలం ఒక్క శాతం ప్రజల చేతుల్లోనే ఉండటం సిగ్గుచేటైన విషయమని, పాలకుల అస్తవ్యస్త విధానాలు, కార్పొరేట్ అనుకూల ధోరణుల కారణంగానే ఆదాయాలు, సంపదలు కొద్ది మంది చేతుల్లో ఉండటం దుర్మార్గమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి దుయ్యబట్టారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ ల్యాబ్ అనే సంస్థ ఇటీవల ప్రచురించిన నివేదిక ప్రకారం 2014-15, 2022-23 మధ్య కాలంలో దేశంలో సంపదకు సంబందించిన ఆదాయ అసమానతలు అధికంగా ఉన్నట్లు తెలిపారు. ఆర్థిక వేత్తలు నితిన్ కుమార్ భారతి, లూకస్ ఛాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి లతో కూడిన కమిటీ భారతదేశ ఆదాయ, అసమానతలపై సర్వే జరిపి దేశంలో పన్నుల వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడినట్లు ఆయన వెల్లడించారు. అత్యంత సంపన్నులైన 1శాతం జనాభా ఆదాయం, సంపద రికార్డు స్థాయిలో ఉన్నాయని, 2022-23లో దేశ ఆదాయంలో 22.6శాతం, సంపదలో 40.1శాతం వీరివద్దే ఉందన్నారు. 1961 తరువాత ఈ స్థాయిలో ఉండటం ఇదే మొదటిసారి అని ఈ నివేదిక బహిర్గతం చేసినట్లు తెలిపారు.

మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర-మంగళగిరి : రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే దేశంలోనే నెం.1గా మంగళగిరిని తీర్చిదిద్దుతానని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని లక్ష్యంతో చంద్ర బాబు అమరావతిని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కేసులు వేసి అడ్డుకు న్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి పట్టణంలోని పీఈపీఎల్ శ్రీ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్‌లో బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమం ద్వారా అక్కడ నివాసితులను కలుసు కున్నారు. లోకేష్ మాట్లాడుతూ 2014లో కట్టుబట్టలతో ఇక్కడకు వచ్చాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని నినాదంతో ఆనాడు అమరావతిని అందరి ఆమోదంతో రాజధానిగా ఏర్పాటుచేసుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణకు పెద్దపీట వేశాం. ప్రజాప్రభుత్వం వచ్చాక అమరావతికి పూర్వవైభవం తీసుకువస్తాం. మన ప్రాంతంలోనే పరిశ్ర మలు ఏర్పాటుచేసి పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌తో అభివృద్ధి! 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు నేను మంగళగిరికి వచ్చా. 5,350 ఓట్ల తేడాతో ఓడిపోయాను. అప్పటి నుంచి కసి, పట్టుదలతో నియోజకవర్గంలోనే ఉండి పనిచేస్తున్నా. ప్రతిపక్షంలో ఉన్నా సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యా. ప్రతిపక్షంలోనే ఇక్కడకు రెండు ఐటీ కంపెనీలు తీసుకువచ్చి 150 మందికి ఉద్యోగాలు కల్పించాం. నన్ను, పెమ్మసాని చంద్ర శేఖర్‌ను భారీ మెజా ర్టీతో గెలిపించాలి. డబుల్ ఇంజన్‌లా పనిచేసి మంగళగిరి రూపురేఖలు మారు స్తాం. బ్లాక్ డెవలప్‌మెంట్ విధానం లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈసారి అధికార మార్పిడి కేవలం రాజకీయంగా అధికార మార్పిడికి సంబంధించినది కాదు. అమరా వతిని కాపాడు కోవడానికి, చదువుకున్న బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అనంతరం పీఈపీఎల్ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో మంగళగిరి జనసేన సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ అభ్యర్థులు వీరే..

- గుంటూరుకు పెమ్మసాని, నరసరావుపేటకు లావు

పెమ్మసాని చంద్రశేఖర్‌రావు, లావు శ్రీకృష్ణదేవరాయులు, చదలవాడ అరవిందబాబు

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : తెలుగుదేశం పార్టీ శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలో గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఇద్దరు పార్ల మెంట్ అభ్యర్థులతో పాటు ఒక ఎమ్మెల్యే అభ్యర్థిని ఖరారు చేశారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రస్తుత పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్లు ఉన్నాయి. మొదటి, రెండవ జాబితాలో చోటు దక్కని నరసరావుపేట నియోజకవర్గానికి సైతం ఈ జాబితాలో అవకాశం దక్కింది. నరసరావుపేట శాసనసభ అభ్యర్థిగా చదలవాడ అరవింద బాబుకు చోటు కల్పించారు. అయితే మొదటి, రెండవ జాబితాలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా ఒక్క నరసరావుపేట అభ్యర్థి అంశం మాత్రం పెండింగ్ పడింది. దీంతో అక్కడ కొంత ఉత్కంఠత నెలకొంది. నేడు ఆ ఉత్కంఠతకు తెర పడింది. మూడవ జాబితా విడుదలతో గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబధించి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల స్థానాలు పూర్తి స్థాయిలో భర్తీ అయినట్లైంది.

కేఎల్‌యూకు 3వ వాటర్ సస్టైనబిలిటీ అవార్డ్

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీకి పాటిస్తున్న నీటి యాజమాన్య పద్ధతులకు 2023-2024 విద్యా సంవత్సరానికి గాను 3వ వాటర్ సస్టైనబిలిటీ అవార్డ్ వచ్చినట్లు వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధ సారదివర్మ శుక్రవారం తెలిపారు. న్యూ ఢిల్లీలో జరిగిన 3వ వాటర్ సస్టెయిన్బిలిటీ అవార్డ్స్ 2023-కార్యక్రమంలో అవార్డును ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతిష్టాత్మకమైన నీటి వినియోగ సామర్థ్యం గృహ రంగంలో నీటి వినియోగదారు లలో అత్యుత్తమ అవార్డును గెలుచుకోవడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించిందన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం 2024 సందర్భంగా న్యూ ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లోని జకరండా హాల్‌లో జరిగిన సదస్సులో ఈ అవార్డు ప్రదానోత్సవం జరిగిందన్నారు. ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి. రాజేష్ అందుకున్నారని తెలిపారు. వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధ సారదివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, అసోసియేట్ డీన్ కెజె. బ్రహ్మ చారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌తో సమావేశం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందము, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు పరచు బృందము, వీడియో గ్రాఫర్స్‌తో శుక్రవారం మంగళగిరిలో వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించి వారికి ఏ విదముగా విధులు నిర్వహించాలి అనే అంశాన్ని తెలియజేశారు. ప్రవర్తనా నియమావళి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందము ఫోటో లేదా వీడియో ద్వారా ఎన్నికల వ్యయం నమోదు కోసం సదరు వీడియోలను అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్‌కి సమర్పించాలన్నారు. అందరూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందము వారు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఆచరణ ఎలా అమలు జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించి సక్రమముగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల ఎటువంటి అలసత్వం/నిర్లక్ష్యం వహించవద్దని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుపరచు బృందము, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందము వీడియో గ్రాఫర్ల బృందమునకు సూచనలు చేశారు.

రూ.2లక్షలు విలువైన హోం అప్లయెన్సెస్ అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : చినకాకాని షైన్ ఆనంద శరణాలయానికి శుక్రవారం గుంటూరు ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఆధ్వర్యంలో సీఎస్ఆర్ యాక్టివిటీ 2023-24లో సుమారు రూ.2లక్షల విలువైన హోం అప్లయెన్సెస్‌ను అందజేశారు. ముఖ్యఅతిథిగా గుం టూరు డీజీఎం దినేష్ గులాటి సతీమణి పూజా గులాటి హాజరై శరణాలయం కు అందజేశారు. ఎస్‌బీఐ ఆర్ఎం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఏవో ఆఫీస్ తరఫున శరణాలయంలో నిత్యం వినియోగించుకునే వస్తువులను ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హెచ్ఆర్ కిషోర్ కుమార్, డిప్యూటీ మేనేజర్ హెచ్ఆర్‌బాబు, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఓటరు దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించేలా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఓటరు దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించేలా ప్రణాళిక ప్రకారం ప్రకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడి ఈఆర్వోలను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓటరు దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సంబంధించిన అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి సూచనలు అందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్, కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఈఆర్వోలతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 7,8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా మార్చి 26వ తేది నాటికి పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఏమైన సంఘటనలు జరిగితే వాటికి సంబంధించిన వాస్తవ వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేసేందుకు నివేదికను వెంటనే సంబంధిత ఆర్‌ఓలు అందించాలన్నారు.

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

విశాలాంధ్ర-మంగళగిరి : పోలింగ్‌కు ముందు జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరుచుటకు మంగళగిరి మండలములోని ఆత్మకూరు గ్రామములో గల నిర్మల కాన్వెంట్‌ను డీఎస్పీ రవికాంత్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రిసిటీ, అగ్నిమాపక అధికారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ స్థిరత్వం, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చి ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనల మేర అత్యున్నత ప్రమాణాలతో వారం రోజుల్లోగా తయారు చేయుటకు తగు సూచనలు జారీ చేశారు. పరిశీలించిన వారిలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ తదితరులు ఉన్నారు.

భావి తరాలు సుఖ సంతోషాలతో ఉండాలంటే జగన్ మళ్ళీ సీఎం కావాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రంలోని ప్రతి పేదవాడి మనసులో భావితరాలు సుఖ సంతోషాలతో ఉండాలంటే మళ్లీ జగన్ సీఎం అయితేనే తామనుకున్నది నెరవేరుతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నట్లు తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి షేక్.నూరి ఫాతిమా తెలిపారు. శుక్రవారం 15వ డివి జన్‌లో సుమారు 30 సంవత్సరాలు నుంచి తెలుగుదేశం పార్టీ జెండాను భుజాన వేసుకుని క్రియా శీలకంగా తిరిగిన 32 కుటుంబాలు నేడు రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ సంక్షేమాభివృద్ధికి అకర్షితులై నూరి ఫాతిమా చేతులు మీదగా వైసీపీలో శుక్రవారం చేరారు. అనంతరం పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరికీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనని గెలిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మస్తాన్, నన్నే తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రచారాల్లో ఉద్యోగులు పాల్గొంటే కఠిన చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రచారాల్లో ఉద్యోగులు, వాలంటీర్లు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎవరు పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం రాజకీయ నాయకుల సమావేశాలకు హాజరైన 12 మంది వాలంటీర్లను, ప్రజాప్రతినిధులతో ప్రచారాల్లో ఉన్న ఇద్దరు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ కమీషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ నివేదిక మేరకు సమావేశా నికి హాజరైన అల్లాడి స్వాతి, యస్.సుధా కృష్ణ వేణి, కే.నాగావర్ధని దేవి, యు. పుష్పాంజలి, డి.నీలిమ, యం.నాగేశ్వర రావు, ఎ.భాగ్యలక్ష్మి, యం.శిరీష, డి.శిరీష, బి.సాయి, పి.భాగ్యశ్రీ, పి. సురేంద్ర బాబు లను వాలంటీర్ల విధుల నుండి తొలగించినట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో విజయవంతమైన ఆపరేషన్లు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో వేర్వేరుగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చేసిన ఆపరేషన్లు విజయవంతం కావడంతో శుక్రవారం పేషంట్ బంధువులు సంతోషం వ్యక్తంచేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని ఆర్.అగ్రహారా నికి చెందిన పీవీ రామశాస్త్రి (81) పొట్టలో ప్రేగులు జారిపోయి హెర్నియాగా మారిందని చెప్పారు. హెర్నియాలోని ప్రేగులు అడ్డంపడి విరోచనం బయటకు వెళ్ళకపోవడంతో పేగులు మడత పడ్డాయని, దీంతో కిడ్నీ పని చేయకపోవడం మూత్ర విసర్జన సరిగా బయటకు వెళ్ళడంలేదన్నారు. ఈ నెల 12వ తేదీన జీజీహెచ్‌కి క్లిష్టమైన హెర్నియ వ్యాధితో వచ్చారని, వారికి అన్ని విధాలా పరీక్షలు చేసి హెర్నియ సంచిలో చిన్నప్రేగు మడత పడినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. దీనిని విడదీసి మళ్ళీ ప్రేగులను అమర్చి జాలి (మెష్)అమర్చినట్లు ఆయన తెలిపారు. వయస్సు పైపడటంతో ఆపరేషన్ చేయాలా? వద్దా? అనేది కూడా ప్రస్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. రెండు సార్లు గుండెకు స్టంట్, రెండు సార్లు కవాతులు టవాల్స్, క్యాన్సర్ ఆపరేషన్ చేశారని, అలాంటి సమయంలో ఆపరేషన్ చేసేందుకు ఆలోచించి పేషంట్ బంధువులకు వివరించినట్లు చెప్పారు. ధైర్యంతో ఆపరేషన్ ప్రారంభిం చినట్లు తెలిపారు. ప్రస్తుతం పేషంట్ పరిస్థితి ఆరోగ్యవంతంగా ఉన్నారని, మూత్రపిండాలు పని చేస్తున్నాయని, మల విసర్జన కూడా మాములుగా ఉందని ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో పేషంట్‌ను 2 రోజుల్లో డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ సత్య శ్రీనివాస్, డాక్టర్ ఇందిర, డాక్టర్ నాగ సంతోష్, డాక్టర్ లిఖిత, డాక్టర్ శ్యాం పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పర్యవేక్షణ

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక పురపాలక సంఘం అవుట్‌డోర్ పర్యవేక్షణలో భాగంగా 7వ డివిజన్ పరిధిలోని 33, 34 వార్డులను మున్సిపల్ కమిషనర్ శుక్రవారం సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని డ్రైన్లను, తడిచెత్త, పొడిచెత్త సెగ్రిగేషన్ ప్రక్రియను, డ్రైన్ల యందు సిల్ట్‌ని తొలగించుటను పరిశీలించారు. ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న వ్యాపారస్తుల షాపులకు సంబంధించిన డి అండ్ ట్రేడ్ లైసెన్సు లను పరిశీలించారు. రోడ్డుపై టిఫిన్ సెంటర్లను నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారస్తుల నుండి 1000 రూపాయిలు మరియు ప్లాస్టిక్ కప్పులు రోడ్డుపై వేసినందుకు 200 రూపాయలు అపరాద రుసుము విధించి వసూలు చేయడం జరిగింది. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MOHAMMED MUKAMMIR RAHAMAN** (Old Name), S/o. Mohammed Sultan, Resident of Door No.66-9-471, Mufthy Street, Chinna Bazar, Guntur - 522003, Guntur District, Andhra Pradesh. I have changed my name as **MOHAMMAD MUKAMMIR RAHAMAN** (New Name) S/o. Mohammed Sultan. Hereafter my name is known as **MOHAMMAD MUKAMMIR RAHAMAN** (New Name) S/o. Mohammed Sultan.

CHANGE OF NAME

I, **MOHAMMED ZAREENA BEGUM** (Old Name), W/o. Mohammad Mukammir Rahaman, Resident of Door No.66-9-471, Mufthy Street, Chinna Bazar, Guntur - 522003, Guntur District, Andhra Pradesh. I have changed my name as **MOHAMMAD ZAREENA BEGUM** (New Name) W/o. Mohammad Mukammir Rahaman. Hereafter my name is known as **MOHAMMAD ZAREENA BEGUM** (New Name) W/o. Mohammad Mukammir Rahaman.

CHANGE OF NAME

I, **GOKARAJU BHGYALAKSHMI** (Old Name), W/o. GOKARAJU NARASIMHAMURTHY RAJU, Resident of Door No.3-47, Khajipalem Village, Pittalavanipalem Mandal, Guntur District - 522329, Andhra Pradesh. I have changed my name as **GOKARAJU BHAGYALAKSHMI** (New Name) W/o. GOKARAJU NARASIMHAMURTHY RAJU. Hereafter my name is known as **GOKARAJU BHAGYALAKSHMI** (New Name) W/o. GOKARAJU NARASIMHAMURTHY RAJU.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఓటును స్వేచ్ఛగా వేసేందుకు చర్యలు

విశాలాంధ్ర-కారంపూడి: మాచర్ల నియోజకవర్గంలో ఓటరు తన ఓటును స్వేచ్ఛగా వేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మాచర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ శ్యాం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల ంలోని అన్ని పోలింగ్‌కేంద్రాలను ఆయన పరిశీలించారు. నియోజక వర్గంలో 299 పోలింగ్‌కేంద్రాలు ఉండగా అందులో 141 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. ఈ కేంద్రాలను కేంద్రబలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కేంద్రాలలో లైవ్‌వెబ్‌కాస్ట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాలలో గొడవలు సృష్టించేవారిపై బైండోవర్‌కేసులు పెడతామన్నారు. ఓటరు తమ ఓటు వివరా లకై బూత్‌లెవల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీలు తమ పార్టీ ప్రచారం కోసం సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాల న్నారు. ఓటరు లిస్టులో మార్పులు ఉండవన్నారు. నామినేషన్ చివరి రోజు వరకు కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట ఎంసీసీ జి శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ జయవర్ధన్, ఎస్ఐ బి రామాంజనేయులు ఉన్నారు.

నీటి వృధాను అరికడదాం

విశాలాంధ్ర-నకరికల్లు : సమస్త జీవకోటి మనుగడకు మూలా ధారమైన నీటిని ప్రతిఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని, నీటిని అనవసరంగా వృధా చేయరాదని గణిత ఉపాధ్యాయులు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహన రావు అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయని పఠాన్ మల్లిక అధ్యక్షతన జల దినోత్సవంను నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లిక మాట్లాడుతూ నీరు జీవకోటికి ప్రాణాధారమని, నీరు లేనిదే జీవం లేదని, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గణిత ఉపాధ్యాయులు గేరా మోహన రావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పు, భూతాపాల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెరుకూరి వెంకటేశ్వర్లు, ఏసీహెచ్ వెంకట్రావు, షేక్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని పాడిబండ్ల గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బాలి రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు టిడిపిలో చేరారు. పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్, శివమ్మ, సుజాత, ముంతాజ్, శివయ్య, వడ్లమూడు అప్పారావు, మిలిటరీ మౌలాలి, భాష, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దరువూరి ఫౌండేషన్ ఉచిత వాటర్ ప్రారంభం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిఎన్ఆర్ (దరువూరి నాగేశ్వరరావు) ఫౌండేషన్ ద్వారా వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా అందిస్తున్నారు. శుక్రవారం 21వ వార్డుకు ట్యాంకర్ వెళ్లి వార్డ్ ప్రజలకు నీళ్ల పోశారు. ఈ సందర్భంగా డీఎన్ఆర్ ఫౌండేషన్‌కు వార్డ్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎప్పుడు అవసరమైన సమాచారం ఇచ్చిన వెంటనే మీకు ట్యాంకర్‌ని పంపిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో 21వ వార్డు ఇంచార్జి జొరిగె తిరుమల శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు యక్కల సుబ్బారావు, సెక్రటరీ శిరసాల భాస్కరరావు, యువత అధ్యక్షులు బిట్ర సింహాచలం, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు జొరిగె కోటేశ్వరావు, పట్టణ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నపురెడ్డి శివప్రసాద్, వార్డు యస్సి సెల్ అధ్యక్షులు గర్నెపూడి చిన్ని, టీడీపీ పార్టీ పాల్గొన్నారు.

తిరునాళ్ళ ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-దుర్గి: అమ్మవారి తిరునాళ్ళ (జాతర) పర్యవేక్షణ బాధ్యతలను పల్నాడు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి టి.సత్యనారాయణ రెడ్డిని కమీషనర్ కార్యాలయం నియమించినట్లు ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వాహణాధికారి పి.సైదమ్మబాయి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం ఈనెల 24 నుంచి 25వ తేదీ వరకు జరుగును. భక్తులు లక్షలాదిగా తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నామన్నారు.

మానవాళి జీవనానికి నీరు ముఖ్యం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ప్రపంచ నీటి దినోత్సవమును మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు పట్టణంలోని తారకరామ సాగర్ ప్రాజెక్టులో ఉన్న వాకింగ్ ట్రాక్‌పై శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనం ప్రస్తుతం ఎలాగ అయితే నీరును వినియోగిస్తున్నామో, భావితరాల వారికి కూడా చక్కగా, సమృద్ధిగా నీరు వినియోగించుకునే విధంగా నీటి నిల్వలు అధికంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భారతదేశంలో అనేకచోట్ల నీరు లభించక అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని, అడవుల్లో కూడా నీటి నిల్వలు లేక అనేక జంతువులు నీటికోసం ప్రజా జీవనంలోకి వస్తు అనేక అవస్థలు పడుతున్నాయన్నారు. ఇంకుడు గుంతలు ఇంకా అనేక విధాలుగా నీరు నిల్వలు పెరిగే విధంగా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కళ్లం వీర భాస్కర రెడ్డి, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చే చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-రెంటచింతల : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చే చలివింద్రాల ఏర్పాటుతో స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవలందించడం అభినందనీయమని మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటుతో పాదచారులకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తూ సామాజిక సేవ లందిస్తున్న నిర్వా హకులు పేరం చెన్నారెడ్డి, తోడ్పాటందించిన దాతలు, సహచరులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో మద్దిరాల కృష్ణారెడ్డి,కేతావత్ రంగనాయకులు, గొట్టం బ్రహ్మారెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బొల్లా బ్రహ్మనాయుడు

విశాలాంధ్ర-వినుకొండ : ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వినుకొండ నియోజవకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించాను. మరింతగా విను కొండను అభివృద్ధి చేసుకొనేందుకు మరోమారు తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు అభి. వృద్ధికి ఓటు వేయాలని ఎమ్మెల్యే బొల్లా ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో తొలుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎన్నికల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 28వ వార్డులో పర్యటించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లా డుతూ వినుకొండ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా గత ఐదేళ్ళు పనిచేశానని, పట్టణంలోని ఎన్ఎస్పి కెనాల్ రోడ్డు నిర్మాణం, స్టేడియం నిర్మాణం, కొండపై ఘాట్ రోడ్డు, సింగర చెరువు అభివృద్ధి, తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు, నూతన పాఠశాల భవన నిర్మాణాలు వంటివి చేపట్టి విను కొండను అభివృద్ధిబాట పట్టించానని, రానున్న రోజుల్లో వినుకొండను మరిం తగా అభివృద్ధి చేసుకోవాలంటే మరోమారు తనకు అవకాశం కల్పించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. గత 2019 ఎన్నికల నాటికి కేవలం తాను వైసీపీ నాయకుడిగా బరిలో నిలిచానని, ప్రత్యర్థుల వైఫల్యం వలన, నేను అభివృద్ధి చేస్తాను అనే నమ్మకంతో తనకు 29వేల మెజార్టీ వచ్చిందని, అయితే 2024 ఎన్నికల నాటికి తాను ఎమ్మె ల్యేగా వినుకొండను అభివృద్ధి చేసి ఎన్నికలకు వెళుతున్నానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆశీస్సులు ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా అనీల్ కుమార్ యాదవ్ కి ఉంటాయని, ఇరువురికీ ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గతంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు మోడీని తిట్టి, నేడు పదవుల కోసం మళ్లీ పొగుడుతున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు ప్రజల కోసం కాదని పద వుల కోసం మాత్రమేనని ప్రజలకు తెలుసన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ 175 స్థానాల్లో విజ యం సాధిం స్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బొల్లా తనయుడు బొల్లా గిరిబాబు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గురజాల నియోజకవర్గ సూపర్ సిక్స్ మేనిఫెస్టో

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటు పల్నాటి ప్రజల చిరకాల వాంఛ అని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు పల్నాడు జిల్లా ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ మేనిఫెస్టో తోడుగా గురజాల నియోజకవర్గానికి శుక్రవారం ప్రత్యేక మ్యానిఫెస్టోని విడుదల చేస్తున్నట్లు అయన తెలిపారు. సంవత్సరానికి చంద్రన్న ఇచ్చే కానుక మూడు గ్యాస్ సిలిండర్లతో పాటుగా, గత మూడు దశాబ్దాలుగా తనను ఆదరిస్తున్న గురజాల నియోజకవర్గంలోని అక్క చెల్లెమ్మలకు ఐదు సంవత్సరాలకు గాను ఉచితంగా ఒక సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 1.5 లక్షల మందికి ఉచితంగా చంద్రన్న భీమా ప్రీమియం చెల్లింపు. హజ్ యాత్ర కోసం వెళ్లే ముస్లింల సోదరుల కోసం లక్ష రూపాయల చేయూత. అదేవిధంగా క్రైస్తవ సోదరుల యేసు దీక్షాపరుల కోసం ఉచితంగా వేలంగిని క్షేత్ర ప్రయాణానికి ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుంద అన్నారు. యూత్ పాలసీతో నియోజకవర్గంలో 15 వేల మంది యువతకు స్వయంగా ఉపాధి కల్పన మరియు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పాటు వంటి అంశాలతో గురజాల ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందన్నారు. దీనితో పాటుగా పార్టీ మేనిఫెస్టో తో కలిపి గురజాల నియోజకవర్గానికి ఏప్రిల్ మొదటి వారంలో పూర్తిస్థాయి మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.

మునుగోడులో ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మునుగోడు గ్రామంలో షేక్ బాదుల్లా బ్రదర్స్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం చేస్తున్న ముస్లిం సోదరులకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, మండల వైసీపీ నాయకులు పోరెడ్డి శివరామిరెడ్డి, మండల వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, మునుగోడు మాజీ సర్పంచ్ మేకల శివశంకర్, వైసీపీ నాయకులు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు: నవ్యాంధ్ర రాష్ట్రం అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని గారపాడు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గారపాడులో టీడీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు డప్పు తీన్మార్ వ్యాఖ్యలతో స్వాగతం పలుకుగా ప్రవీణ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గం మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, రాజకీయం అనుభవం లేకపోయినా ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటానని, ఆశీర్వదించండి అంటూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, పెనుమంచు రామారావు, అత్తిమళ్ళ రమేషు, మక్కిన సాగరు, బండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన పాటిబండ్ల టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి నచ్చి ఎంతోమంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. పెదకూరపాడు మండలం పాటిబండ్ల గ్రామానికి చెందిన టీడీపీ షేక్ రహమాన్, హబీబ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోదరుడు రఘునాథ్‌రావు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అందరూ కలసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల వైకాపా కన్వీనర్ బస్టాండ్ షరీఫ్, వైస్ ఎంపీపీ భాష, అల్లం కిషోర్ రెడ్డి, ఎన్నమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత వైసీపీకి దక్కింది

విశాలాంధ్ర-తాడేపల్లి : రాజధాని ఇక్కడే ఉంటుందని వైసీపీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులంటూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు విమర్శించారు. శుక్రవారం తాడేపల్లి స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే నారా లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నారా లోకేష్ మంగళగిరిలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని అన్నారు. ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఇట్టా భాస్కర్ మాట్లా డుతూ వైసీపీ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని విమర్శించారు. ఎమ్మెల్యే ఆర్కే రాజధాని ఇక్కడే ఉంటుందని, జగన్ ఇల్లు ఇక్కడే కట్టుకున్నారని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారం లోకి వచ్చిన తరువాత మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని చూశారని విమర్శిం చారు. లోకేష్‌ని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే ఆర్కేకి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సి పల్ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు అన్నెం కుసుమ, దర్శి హరికృష్ణ, తాడిబోయిన గోపి, మాలిక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవశక సృష్టికర్త శాలివాహనుడి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రెంటచింతల : మండల కేంద్రమైన రెంటచింతలలోని జాతీయ జెండా స్తూపం వద్ద శుక్రవారం కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నవశక సృష్టికర్త, ప్రథమాంధ్ర మహా పాలకుడు శాలివాహన చక్రవర్తి 1945వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటిగా శాలివాహనుడి చిత్రపటానికి సంఘం పెద్దలు పూల మాలవేసి నివాళులర్పించారు. విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవజాతి చరిత్రలో కాలమానాలను చరిత్ర ప్రసిద్ధులైన వారి పేరుతో వాడటం పరిపాటి కాగా వీటిలో ప్రముఖమైన క్రీస్తు శకంతో పాటు భారతదేశంలో ప్రామాణికంగా శాలివాహన శకం కావడం గమనార్హమన్నారు. పేద కుమ్మరి కుటుంబంలో సామాన్యుడైన శాలివాహనుడు రాజుగా సుసంపన్నమైన రాజ్యాన్ని పరిపాలించి, రాజ వంశాన్ని ఏర్పాటు చేసి వారసురాలతో శాలివాహన శకంగా కొనసాగడం ప్రాచీన భారత దేశంలో అరుదైన ఘటనగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సన్నెగంటి పోతులూరి, సిద్దయ్య, బొంకూరి తిరుపతిరావు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు శాంతి మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : ప్రపంచానికి క్రీస్తు చూపిన శాంతి మార్గం నేటికీ అనుసరణీయమేనని, ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు ధరించే మాల ధారణ వ్యక్తిగతమైన క్రమశిక్షణను నేర్పుతుందని, క్రీస్తు మార్గాన్ని చేరువ చేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలంలోని భట్లూరు గ్రామంలో మాలదారుల ప్రత్యేక ప్రార్ధనా కూటమిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా సంఘ కాపరి అంబటి రాంబాబుకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయన కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అంబటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో క్రీస్తు ఆశీస్సులు, మీ అందరి దీవెనలు నాపైన, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ పైన ఉండాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, సంఘస్తులు, గ్రామ, మండల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాసు పిచ్చిరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని తురకవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాసు పిచ్చిరెడ్డి అనారోగ్యంతో మరణించారు. భౌతికకాయానికి స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకరరావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండలంలోని మునుగోడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఇసు కరెంటు షాక్‌తో మరణించగా వారి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్యకర్తకు కన్నా పరామర్శ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ముప్పాళ్ల మండలం మాదలకు చెందిన తాళ్లూరి రామకోటేశ్వర రావు అనారోగ్య కారణంగా సత్తెనపల్లి పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్న సమయంలో వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను మాజీ మంత్రి, నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కోరారు. తగిన జాగ్రత్త తీసుకోవాలని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కన్నా వెంట మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటార్ వైర్ల అపహరణ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన పలువురు రైతుల తమ పంట పొలాల వద్ద ఉన్న వ్యవసాయ బోరుబావులు వద్ద ఉన్న మోటార్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. మోటార్లలో ఉండే రాగి తీగ ఖరీదైనది కావడంతో దుండగులు రాత్రి సమయాలలో చోరీకి పాల్పడుతున్నట్లు రైతులుఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత రైతులు పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఈ మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ మోటార్ వైర్లు అపహరిస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచి త్వరలోనే పట్టుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. కొల్లి సత్యం గుదే హనుమంతరావు, కాకర్ల శివరామయ్య,గర్నేని శివరామయ్య, రాయపాటి చిన్నా, కరాలపాటి సైదా, ఉన్నం శేషయ్య, వి వెంకటేశ్వర్లు, తదితర రైతులు ఫిర్యాదు చేశారు.

జనసేన పార్టీ నాయకులపై జరిగిన దాడికి తీవ్రంగా ఖండన

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని మించాల పాడు గ్రామానికి చెందిన పసుపులేటి ప్రసాద్, మరో ముగ్గురు జనసేన నాయకుల పై జంగ మహేశ్వరపాడులో వైసీపీ వర్గీయులు జరిపిన దాడిని టీడీపీ, జనసేన, బిజెపి ఉమ్మడి మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఉమ్మడి గుం టూరు జిల్లా జనసేన కార్యదర్శి పులి హరి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం దుర్గి లోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీకి చెందిన పసుపులేటి ప్రసాద్, హనుమంతరావు, దాసరి చెన్నయ్య, శింగంశెట్టి మధు మాచర్ల పట్టణంలో పనులు ముగించుకుని వారు స్కార్పియో వాహనంలో రాత్రి 9.30 గంటల సమయంలో స్వగ్రామం మించాలపాడు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో జంగమహేశ్వర పాడులో పోలీసు పికెట్ సాక్షిగా ఎదురుగా వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డారు. ఈదాడిలో వాహనం ధ్వంసం చేసి ఒక భయానక వాతావరణాన్ని దుర్గి మండలం, మాచర్ల నియోజకవర్గంలో కల్పించారని అన్నారు. పోలీసుల పికెట్ జంగమహేశ్వరపాడులో 2 సంవత్సరాల నుంచి దోషులకు రక్షణ కల్పిస్తున్నాయని అన్నారు. గ్రామంలో లేనివారిని తీసుకొచ్చి పికెట్ పెడితే ఒక అర్థం ఉంటుందని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను తరిమివేసి, వైసీపీ గుండాలకు రక్షణగా పెట్టిందని గమనించాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ముఖ్యంగా జంగమహేశ్వరపాడు గ్రామంలో ఇటీవల పాశం రాజు, గాజుల అంజి, గుమ్మా శ్రీను ఈ ముగ్గురి పై దాడి చేస్తే, పోలీసుల కేసుల నమోదు కోర్టుకు పరిమిత మాత్రమేనని, వైసీపీ వాళ్ళకు మాత్రం వెంటనే బెయిల్ వచ్చే కేసులు పోలీసులు నమోదు చేస్తారని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు మేము ఓపిక పట్టుకుంటూ వచ్చామని, ఎన్నికల కోడ్ వచ్చిన ఇక్కడ అధికారులు మాత్రం లెక్కలేని విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జనసేన నాయకులను టార్గెట్ చేసి వారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తోటకూర శ్రీనివాసరావు, జానికీరామయ్య, మేకల రామారావు, రామయ్య, శ్రీహరి, గోగుల సీతారెడ్డి, కుర్రి శివారెడ్డి, బృంగా రమణ, టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 10 కుటుంబాలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్: మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీలో చేరారు. వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి బ్రహ్మారెడ్డి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బ్రహ్మారెడ్డి అన్నారు. పార్టీలో చేరే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి రామిశెట్టి సైదారావు, కోట నాగరాజు, మాచర్ల మరియబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాన్ని తగలబెట్టిన వారిపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-మాచర్ల: వైసీపీ నాయకుడు బందారు వెంకటరామయ్య బొలెరో వాహనాన్ని, టీడీపీ అల్లరి మూకలు తగలబెట్టడం దుర్మార్గమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం 8వ వార్డులో బ్యానెట్ కాలిన బొలెరో వాహనాన్ని ఆయన పరిశీలించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వాహనానికి నిప్పంటించిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వాహన మరమ్మతుల నిమిత్తం బందారు వెంకటరామయ్యకు రు.1 లక్ష నగదును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ ఛైర్మన్‌లు తురకా కిషోర్, బోయ రఘురామిరెడ్డి, సీనియర్ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, పోలా శ్రీనివాసరావు, గట్ల కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ తరగతులు

విశాలాంధ్ర - వినుకొండ : రైల్వే ఉద్యోగాలు (అసిస్టెంట్ లోకో పైలట్, గ్రేడ్ టెక్నీషియన్, ఆర్ పి ఎఫ్, ఆర్ ఆర్ బి -గ్రూప్ డి, ఇతర పోటీ పరీక్షలు)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శ్రీ బాలాజీ ఐ.టి.ఐ. కళాశాల వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కర్రీ వెంకట్ తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 24 ఆదివారం ఉదయం 10 గంటలకు కళాశా లలో జరగబోయే ఉచిత అవగాహన సదస్సు, ఉచిత కోచింగ్ తరగతుల ఎంపిక ప్రక్రి యకు హాజరుకావాలని, ఎంపికైన వారికి మాత్రమే ఈనెల 25వ తేదీ సోమవారం నుండి ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని, ప్రతి ఒక్క అభ్యర్థి ఈ ఉచిత రైల్వే ఉద్యోగ కోచింగ్ తరగతులను వినియోగించుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరముల కొరకు 7702892288, 8341821710, 9440542030 అను నంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును టీడీపీ అధిష్టానం ప్రకటించటం పట్ల శుక్రవారం మండలంలోని టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షులు మంజుల ఆంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చుస్తూ సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మంజుల ఆంజనేయులు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవింద బాబును ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ ఎన్నికలలో టీడీపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి వెంకటేశ్వర్లు(చిన్నా), తమ్మిశెట్టి వెంకట్రావు, గట్టా వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఉత్తమ పరిశోధకుడికి అవార్డు

విశాలాంధ్ర - వినుకొండ : అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన అవార్డులు అందుకున్న వినుకొండ వాసి. ఇటీవల తమిళనాడులో తిరుచ్చిలో ఈ నెల 16వ తారీఖున అంతర్జాతీయ కాంగ్రెస్ ఫర్ రీచార్జ్ ఎక్సలెన్స్ (ఆసియా రీచార్జ్ అవార్డుల) ప్రధానోత్సవంలో డాక్టర్ ఎస్ కే అల్తాఫ్ హుస్సేన్ భాష కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో రీసెర్చ్ పబ్లికేషన్స్ చేసినందుకు అంతర్జాతీయ ఉత్తమ పరిశోధకుడికి అవా ర్డును అందుకున్నారు. అల్తాఫ్ హుస్సేన్ భాష కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ మార్కాపురంలో ప్రొఫెసర్ పనిచేస్తున్నారు. కళాశాల సెక్రెటరీ కృష్ణ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి కృష్ణారెడ్డి స్టాఫ్ కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ అభినందనలు తెలిపారు.

పాఠశాల బస్సు దగ్ధం- విద్యార్థులు సురక్షితం

విశాలాంధ్ర-దుర్గి: దుర్గి నుంచి నెహ్రూనగర్ తండాకు వెళ్తున్న పాఠశాల బస్సులో మంటలు చెలరేగాయి. దుర్గి మండలంలోని కంచర గుంట గ్రామం వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఘటన జరగ్గా మంటలు మొదలవగానే అందులోని 30 మంది విద్యార్థులను దించేశారు. బస్సు దుర్గి లోని ఓ ప్రైవేట్ పాఠశాలదిగా చెబుతున్నారు. విద్యార్థులు అంతా సురక్షితంగా బయటపడటంతో తల్లి దండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

అన్నదానం కార్యక్రమం

విశాలాంధ్ర - వినుకొండ : విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన నాగేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.రామ లింగేశ్వరరావు, అవ్వారు కోటేశ్వరరావు, జి. నాగేంద్రుడు, వైవి సుబ్బయ్యశర్మ, సుబ్బయ్య శాస్త్రి, రాఘ వయ్య, దీక్షితులు, దుబ్బల దాసు, వెంకటస్వామి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : విద్యార్థులు విద్యతోపాటు సరికొత్త ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెంచుకోవాలని కెనడా సీపీపీ డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ హేమ జంపాల విద్యార్థులకు సూచించారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీ రింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జ్రోత్రియా-24 వేడుకలలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయటానికి ఇలాంటి సాంకేతిక వేడుకలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు కెనడా డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ హేమ జంపాల ముఖ్యఅతిథిగా హాజరై జ్రోత్రియా వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేఎల్‌యూలో విద్యార్థులకు అధునాతన లేబరేటరీలు, అంకితబావం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని ప్రసంశించారు. కార్యక్రమంలో వైస్‌చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారది వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే రామక్రిష్ణారావు, ఈసీఈ డైరెక్టర్ పరిశోధన, ప్లేస్‌మెంట్స్ అధిపతి డాక్టర్ కె.శరత్ కుమార్, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బుల్లి తెరపైకి మైత్రీ మూవీ మేకర్స్

విశాలాంధ్ర-గుంటూరు : ఆసక్తికరమైన మలుపులు, ఆకట్టుకునే కథలతో సాగే సీరియల్స్‌ను అంది స్తున్న జీ తెలుగు మరో సరికొత్త సీరియల్‌ను తన అభిమాన వీక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, కుటుంబ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మా అన్నయ్య. ఈ సీరియల్లో అన్నాచెల్లెళ్ల మధ్యనున్న అనుబంధం, ప్రేమ, బాధ్య తలు, అనురాగాలను కొత్తకోణంలో చూపించనున్నారు. అనూహ్యమైన కథతో రానున్న మా అన్నయ్య ఈ నెల 25న సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటలకు ప్రారం భం కానున్నది. జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు, సీరియల్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న గోకుల్ మీనన్‌లు ప్రసంగించారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శ

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గంటా బ్రహ్మం మృతదేహానికి టీడీపీ, జనసేన నేతలు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ మాట్లాడుతూ గంటా బ్రహ్మం అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మృతుని కుటుంబానికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుండెబోయిన సాంబశివరావు, శీను, రంగారెడ్డి, తేలూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.